



నేటి నుంచి గుబ్బల మంగమ్మ దర్శనం

బుట్టాయగూడెం, ఆగస్టు 2 : బుట్టాయగూడెం మండలం కోర్సవారిగూడెం పంచాయతీ పరిధిలోని గుబ్బల మంగమ్మను శనివారం నుంచి భక్తులు దర్శించుకోవచ్చని ఆలయ కమిటీ తెలిపింది. ఏజెన్సీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండ వాగులు పొంగి, అమ్మవారి ఆలయానికి వెళ్ళే రహదారి, మెట్లు, దుకాణాలు కొట్టుకుపోయాయి. వీటి మరమ్మతులు కారణంగా దర్శనాలు నిలిపివేశారు. ఇవి పూర్తి కావడంతో తిరిగి దర్శనాలకు ఏర్పాట్లు చేశారు.

డీఎల్‌ఎడ్ పరీక్ష ఫలితాలు విడుదల

ఏలూరు అర్బన్, ఆగస్టు 2: ఈ ఏడాది జూన్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన డీఎల్ ఎడ్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయని ఏలూరు జిల్లా డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణతా సర్టిఫికెట్లను bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. నిర్ణీత ఫీజుచెల్లించి రీ-కౌంటింగ్‌కు ఈ నెల పదవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఓపెన్‌స్కూల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

భీమవరం రూరల్, ఆగస్టు 2 : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్‌స్కూల్) ద్వారా 2024-25 విద్యా సంవత్సరంలో పదవతరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ఎన్‌రోల్ మెంట్ డ్రైవ్‌ను శుక్రవారంనాడు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చేనెల 27వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చునని, 200 రూపాయల అపరాధ రుసుముతో ఈనెల 28వ తేదీ నుంచి వచ్చేనెల 4 వరకు గడువు ఉందని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారిణి జి నాగమణి మాట్లాడుతూ ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, ఏఈ కో-ఆర్డినేటర్లు ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారంచేసి విద్యార్థులు ఓపెన్ స్కూల్‌లో చేరే విధంగా కృషిచెయ్యాలని కోరారు.

రేంజ్‌లో 41 మంది సీఐల బదిలీ

7

ఇద్దరు సీఐల బదిలీలు నిలిపివేత

కొంత మందిని వీఆర్‌కు పంపిన ప్రభుత్వం

లెక్క తేల్చండి..



యలమంచిలిలో నీట మునిగిన వరి చేనులో రైతు

వరదలు, వర్షాలకు ముంపుబారిన పడ్డ పంట పొలాలపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పంట పొలాలు, నారుమడులను లెక్కించి రైతుల వివరాలను సమర్పించాలని పేర్కొంది. ఈ నెల 5లోగా ఈ జాబితాను అందజేయాలని గడువు విధించింది. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా జాబితాను సిద్ధం చేశారు.

- 5లోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశం
- ముంపు పొలాల గణన
- జిల్లాలో 29,505 ఎకరాల్లో పంట నష్టం
- 2565 ఎకరాల్లో వరి నాట్లు మునక
- రాయితీ విత్తనాలు సిద్ధం
- నారు కొనుగోలు చేసుకుంటున్న రైతులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా 29505 ఎకరాల్లో నాట్లు వేసిన వరిపొలాలు నీటమునిగాయని అధికారులు ప్రాథమికంగా లెక్కకట్టారు. మరో 2560 ఎకరాల్లో వరినాట్లు దెబ్బతిన్నాయి. జిల్లాలో దాదాపు 17500 మంది రైతులు వర్షాల కారణంగా నష్టపోయారు. నివేదిక అందిన తర్వాత ప్రభుత్వం పెట్టుబడి రాయితీని విడుదల చేయనుంది. ఇప్పటికే మంత్రుల బృందం జిల్లాలో పర్యటించింది. వరద ప్రాంతాలను పరిశీలించింది. వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి 25కిలోల బియ్యం, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు, కిలో పామాయిల్, కిలో కందిపప్పు అందించారు. మరోవైపు ముంపు బారిన పడిన పంటపొలాలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతులకు పెట్టుబడి రాయితీని అందించనుంది. నాట్లు కోసం రైతులు ఇప్పటికే రూ.10వేల వరకు పెట్టుబడి చేశారు. వర్షాలతో పంటపొలాలు మునిగిపోయాయి. డ్రెయినేజీ వ్యవస్థ సవ్యంగా లేకపోవడంతో పంట నష్టం అధికమైంది. నారుమడులు నీటమునిగాయి. ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం డ్రెయినేజీ వ్యవస్థను పట్టించుకోకపోవడంతో పంటపొలాల్లో పదిరోజుల పాటు ముంపు వీడలేదు. గట్లు కొట్టుకు పోయాయి. గండ్లు పడ్డాయి. దీనిని అరికట్టేందుకు ఇప్పుడిప్పుడే చర్యలు తీసుకుంటున్నారు. తూడు, గుర్రపు డెక్క తొలగించే సన్నాహాలు చేస్తున్నారు.

నారుకు డిమాండ్

సాగు జాప్యం అవుతోందన్న ఉద్దేశంతో రైతులు నారు కొనుగోలు చేసుకుంటున్నారు. మెట్ట ప్రాంతాల్లో ఉన్న నారుని తరలించుకు వస్తున్నారు. ఇప్పుడు నారుకు డిమాండ్ పెరిగింది. దీనివల్ల పంట మళ్లీ యథావిధిగా సరైన సమయానికి చేతికొస్తుందన్న ఉద్దేశంతో రైతు నారుకొనుగోలు చేసి నాట్లు వేసుకుంటున్నారు. ఇదికూడా రైతుకు అదనపు భారంగా మారింది. నారు దొరకని పరిస్థితుల్లో కొత్తగా నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు.

రాయితీ విత్తనాలు సిద్ధం

రైతులు స్వల్పకాలిక వరిసాగు చేసేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక రచించింది. అటువంటి విత్తనాలను సిద్ధం చేసింది. జిల్లాలో ఎంటీయూ 1153 రకమైన వరి వంగడాలు 2500 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి. ఎంటీయూ 1156 రకాన్ని మరో 900 క్వింటాళ్లు అందుబాటులో ఉంచారు. 1010 రకం 100 క్వింటాళ్లు ఉన్నాయి. వీటిని 80శాతం రాయితీతో రైతులకు అందించనున్నారు. అయితే పీఆర్ 126 రకంపైనా రైతులు ఆసక్తి చూపుతున్నారు. వాటిని ప్రభుత్వం ఇవ్వడం లేదు. వాటికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1153, 1156, 1010 రకాలు సరఫరా చేస్తున్నారు. రాయితీ విత్తనాలను రైతులు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం నివేదిక కోరింది. తదనుగుణంగా పెట్టుబడి రాయితీని విడుదల చేయనుంది.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

35 డ్రెయిన్లలో తూడు తొలగింపు : కలెక్టర్

భీమవరం టౌన్, ఆగస్టు 2 : జిల్లాలోని డ్రెయిన్లలో రూ.ఐదు కోట్ల 92 లక్షలతో చేపట్టిన 35 తూడు తొలగింపు పనులను విమర్శలకు తావు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె డ్రెయినేజ్ డివిజన్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. 'నీటిపారుదల సాఫీగా సాగేలా డ్రెయిన్లలో తూడు తొలగింపు పనులు చేపట్టాలి. ఏ ప్రాంతంలో ఏ రోజు తూడు తొలగింపు పనులు చేపడుతున్నది ముందుగానే సంబంధిత ప్రాంత ప్రజా ప్రతినిధులకు, రైతులకు సమాచారం అందించాలి. 64 పూడికతీత పనులకు మూడు కోట్ల రెండు లక్షలతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం' అని తెలిపారు. 'గునుపూడి సౌత్ డ్రెయిన్ కారణంగా తాడేరు చుట్టుపక్కల ప్రాంతంలోని రెండు వందల ఎకరాల మేర నీరు చేరుతోందని, పొలిమేరతిప్ప మీడియం డ్రెయిన్ కారణంగా బ్యాక్ వాటర్ వల్ల 500 ఎకరాల్లో నీరు చేరుతుంది. ఉప్పుటేరు-చిన్న కాపవరం వద్ద ఉప్పుటేరు మొదట్లో నీటి ప్రవాహానికి కిక్కిస అడ్డు తగులుతోందని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్ వివరించారు. ఆకివీడు దుంపగడప వద్ద రైల్వేలైన్ కింద నిర్మించిన కల్వర్టులో పైపులు, మట్టి దిబ్బ తొలగించకపోవడంతో తూడు, తుక్కు అడ్డుపడి నీటి ప్రవాహానికి ఇబ్బంది కలుగుతోందని చెప్పారు. దీనిపై రైల్వే అధికారులతో మాట్లాడాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. గునుపూడి సౌత్ డ్రెయిన్, పొలిమేర తిప్ప మీడియం డ్రెయిన్, ఉప్పుటేరు కిక్కిస తొలగింపు పనులకు ప్రతిపాదనలను సమర్పిస్తే నిధులను కేటాస్తామన్నారు. ఈఈ డ్రెయిన్స్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీఈలు జి.వినోద్ చంద్ర, కె.వరప్రసాద్, ఏఈఈలు పి.వెంకటేశ్వరరావు, ఖాదర్ వలీ పాల్గొన్నారు.

రూ.55 లక్షలు వసూలు ఎలా ?

- హైకోర్టు న్యాయ నిపుణులతో ఎంపీడీవో చర్చలు
- కలెక్టర్‌కు నివేదించి, పాటదారుడిపై చర్యలు



నరసాపురం, ఆగస్టు 2 : మాధవాయిపాలెం రేవు పాటదారుడు రెడ్డప్ప ధవేజీ బకాయిపడ్డ రూ.55 లక్షలు వసూలు చేసేందుకు అధికారులు శాఖాపరంగా సిద్ధమవుతున్నారు. హైకోర్టులో పంచాయతీ రాజ్‌కు సంబంధించిన ప్రభుత్వ జీపీని శుక్రవారం కలిశారు. న్యాయ పరంగా ఆయన సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ వివరాలన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదించి ఆమె ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరభద్రరావు చెప్పారు. రూ.55 లక్షల బకాయి వసూలుకు ఎనిమిది నోటీసులు ఇచ్చినా ధవేజీ నుంచి సమాధానం లేకపోవడంతో ఎంపీడీవో వెంకటరమణ మానసిక ఒత్తిడికి గురయ్యారు. దీనిపై లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నారు. మరోవైపు ఆయన మరణానికి సైబర్ నేరగాళ్ల బెదిరింపులు కూడా కారణమనే వాద నలు వినిపించాయి. దీనిపై పోలీసులు లోతైన విచారణ చేస్తున్నారు. కేసు కొలిక్కి రాలేదు. ఇటీవల సమావేశమైన జేఏసీ చర్చించి, బకాయి వసూలుకు న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో వీరభద్రరావు అమరావతి వెళ్లి పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన హైకోర్టు న్యాయవాదులతో చర్చించి సలహాలు, సూచనలు తీసుకున్నారు. దీనికనుగుణంగా ముందుగా జిల్లా కలెక్టర్ నాగరాణికి వివరాలను నివేదించి, దానికనుగుణంగా చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నారు. ధవేజీ మాత్రం తాను ప్రభుత్వానికి రూ.55 లక్షలు కట్టాల్సిన విషయం వాస్తమేనని ఒప్పుకున్నారు. తనకు ప్రభుత్వం నుంచి రూ.11 లక్షలు రావాల్సి ఉందని, రూ.50 లక్షలు విలువైన పంటును మండల పరిషత్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని ఇటీవల విడుదల చేసిన వీడియోలో వివరించారు. తీరంలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్‌గా మారింది.

ఆక్వా అదుర్స్



- 100 కౌంటు ధర రూ.240
- ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక పెరుగుతున్న రొయ్యల ధరలు
- సంతోషంలో రైతులు, సాగుపై చిగురిస్తున్న ఆశలు

నాణ్యమైన సీడ్ అందించాలి



కన్నబాబు, కోళ్ళపర్రు

ప్రభుత్వం ప్రకటించిన రాయితీలు ఆక్వా రంగానికి ప్రోత్సాహకరంగా ఉన్నాయి. నిరాశ నిస్పృహలలో ఉన్న ఆక్వారైతులలో ఊపువచ్చింది. ధరలు పెరుగుతుండటం సాగుపై ఆసక్తి పెరుగుతున్నది. నాణ్యమైన సీడ్ అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం సీడ్ హేచరీలు ఏర్పాటు చేస్తే రైతులకు మరింత మంచిది. ఆక్వా ధరలు పడిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి



రామాంజనేయులు, పెదకాపవరం

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కోసం రైతులం ఎదురు చూశాం. గత ప్రభుత్వం హయాంలో ఆక్వారంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొన్నాం. కొనాలంటే కొరివి, అమ్మాలంటే అడవి. ఉత్పత్తులను మంచి ధరలకు అమ్ముకునేలా ఉత్పత్తులను నిలువ చేసేందుకు కోల్డ్ స్టోరేజీ నిర్మాణాలు చేపడితే రైతులకు మరింత మేలు కలుగుతుంది. ఆక్వారైతు మరింత ధైర్యంగా సాగు చేయగలుగుతాడు.

ఆకివీడు రూరల్, ఆగస్టు 2: ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక ఆక్వారంగంలో ఊపు వచ్చింది. అప్పటి వరకు క్రాప్ హాలిడే ప్రకటిద్దామనుకున్న రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీలతో ప్రోత్సాహం పెరిగింది. గత ప్రభుత్వం హయాంలో 100 కౌంటు ధర రూ.190కు దిగపోయినా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. కేంద్రం, రాష్ట్రంలోను నూతన ప్రభుత్వం కొలువు దీరిన తరువాత ధరలు రోజురోజుకు పెరుగుతూ వచ్చాయి. బడ్జెట్‌లో ఆక్వారంగానికి ప్రభుత్వం కేటాయించిన ప్రాధాన్యత, రొయ్యల బ్రూడర్, మేతలపై దిగుమతి సుంకం తగ్గించడంతో ఆక్వారంగానికి ఆక్సిజన్ అందించినట్లు అయ్యింది. దీంతో ఒక్కసారిగా ఆక్వా ఉత్పత్తులపై ధరలు పెరగడం ప్రారంభించాయి. దీనికి తోడు గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాతావరణంలో వచ్చిన మార్పులు వలన వైరస్ వచ్చి సాగు తుడిచిపెట్టుకుపోయింది. దీంతో సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో డిమాండ్ పెరిగి దానికి తగ్గట్టుగా ధరలు కూడా పెరగడం జరుగుతున్నది. దీనితో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 100కౌంటు రూ.240కు చేరింది. శుక్రవారం ఆక్వా ఫార్మర్స్ గ్రూపులో 100కౌంటు ధర రూ. 240, 90 కౌంటు రూ. 250, 80 కౌంటు రూ. 260, 70కౌంటు రూ. 280, 60కౌంటు రూ. 300, 50 కౌంటు రూ. 320, 40కౌంటు రూ. 360, 30కౌంటు ధర రూ. 460 దరకు చేరాయి.



వరద తగ్గడంతో కోడేరు వద్ద బయట పడ్డ మెట్లు

తగ్గిన వరద.. ముంపులోనే వరిచేలు

ఆచంట/యలమంచిలి, ఆగస్టు 2 : గోదావరి వరద మరింత తగ్గినప్పటికి ప్రవాహం వేగం ఉధృతంగానే ఉంది. పలు ప్రాంతాల్లో వరి చేలు ముంపులోనే ఉన్నాయి. యలమంచిలి మండలం కాజ డ్రెయిన్ ఉధృతితో వరి చేలల్లో నీరు బయటకు వెళ్లడం లేదు. కాజ డ్రెయిన్‌పై ఆధారపడి మేడపాడు, ఆర్యపేట, యలమంచిలి, ఊటాడ, కాజ, కలగంపూడి గ్రామాల పరిధిలోని 1800 ఎకరాల్లో వరి చేలు 12 రోజులుగా ముంపులోనే ఉన్నాయి. నారుమళ్లు, వేసిన వరినాట్లు కుళ్లిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేలల్లో నీరు బయటకు మళ్లేదెన్నడో.. సాగు చేసేదెప్పుడో తెలియని దుస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు. నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. డ్రెయిన్‌లలో పూడికను తొలగించి సమస్యను శాశ్వతంగా పరిష్కారమయ్యేలా తగిన చర్యలు చేపట్టాని రైతులు కోరుతున్నారు.

ఎస్‌ఎంసీ ఏర్పాటైన పాఠశాలలకే గ్రాంట్లు

తాజా మార్గదర్శకాల్లో ప్రభుత్వం స్పష్టీకరణ

ఎస్‌ఎంసీకి రెండేళ్ల కాలపరిమితి

కువైట్‌లో కష్టాలు

ఇండియా వచ్చేస్తానంటూ సెల్ఫీ వీడియో

7

కొండలరావుపాలెంలో అటెన్షన్

- మాజీ ఎమ్మెల్యే కొఠారు ఇంటి ముట్టడికి కోమటిలంక గ్రామస్థుల నిర్ణయం
- అప్రమత్తమైన పోలీసులు..
- కోమటిలంకలో పోలీస్ పికెట్



కొండలరావుపాలెంలో మాజీ ఎమ్మెల్యే ఇంటిదగ్గర భారీగా మోహరించిన పోలీసులు

పెదవేగి/ఏలూరు రూరల్, ఆగస్టు 2 : ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొండలరావుపాలెంలో శుక్రవారం ఉదయం నుంచి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటిని కోమటిలంక గ్రామస్థులు ముట్టడించి, దాడి చేసే అవకాశం వుందనే సమాచారంతో ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ అలెర్ట్ అయ్యారు. డీఎస్పీ ఇ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 250 మంది పోలీసు బలగాలను గ్రామానికి పంపించి భారీ బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం వరకు ఎవరూ రాకపోవడంతో 30 మంది ప్రత్యేక పోలీసు దళాలు మినహా మిగిలిన వారు వెనుదిరిగారు. అసలు విషయంలోకి వెళితే.. ఏలూరు రూరల్ మండలం కోమటిలంకలో వంద ఎకరాల్లోని చెరువులను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లీజు పేరిట అప్పటి ఎమ్మెల్యే అబ్బయ్య అనుచరులు హస్తగతం చేసుకున్నారు. ఈ చెరువుల్లో శ్రీపర్రు గ్రామస్థులకు వాటా చెల్లించాలి. అయితే లీజు సొమ్మును చెల్లించకుండా అబ్బయ్య, అతని అనుచరులే బొక్కేశారని గ్రామస్థులు ఆరోపించారు. ఎన్నిసార్లు అడిగినా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం విదేశాలకు వెళ్లిన ఆయన గురువారం తిరిగొచ్చారు. సమాచారం తెలిసి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కోమటిలంక గ్రామస్థులు మూకుమ్మడిగా శుక్రవారం ఆయన ఇంటి ముట్టడికి నిర్ణయించారు. అప్రమత్తమైన పోలీసులు మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద భారీగా మోహరించారు. మరోవైపు కోమటిలంక మెయిన్ సెంటర్‌లో ఉదయాన్నే పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి గ్రామస్థులు, టీడీపీ నాయకులను అడ్డుకున్నారు. కోమటిలంక టీడీపీ నాయకులు శ్యాంబాబు, నటరాజు, చిన్ని, మహంకాళి, పోతురాజు, ముంగర నాగరాజు తదితరులను గ్రామం విడిచి ఆందోళనకు వెళ్లకుండా కట్టడిచేశారు. ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగినా నివురుగప్పిన నిప్పులా ఉంది. మరోవైపు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను గ్రామ పెద్దలు, చెరువు లీజుదారులు కలసి విషయం తెలిపారు.

99.23శాతం పింఛన్ల పంపిణీ

భీమవరం టౌన్, ఆగస్టు 2 : జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా కింద అందించే పెన్షన్ మంగళవారంనాటికి 99.23శాతం నమోదు అయింది. సోమవారంనాడు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెన్షన్‌ను జిల్లా అంతటా పంపిణీ చేయగా 97.26 శాతంగా నమోదు అయింది. మిగిలిన వారికి మంగళవారంనాడు ఉద్యోగులు పంపిణీ చేశారు. జిల్లాలో 2లక్షల 31వేల874 పెన్షన్‌లు ఉండగా మంగళవారంనాటికి 2లక్షల 29వేల991 మందికి పెన్షన్‌లు అందించారు. 1883 మంది పెన్షన్‌లు పొందలేదు.



మైపా గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారితో ఇబ్బందులు

శ్మశానానికి వెళ్లాలంటే నరకమే

నిజంగా నరకం ఎలా ఉంటుందో తెలియదు కానీ మైపా గ్రామంలో ఎవరైనా చనిపోతే వారిని అంత్యక్రియలకు తీసుకువెళ్లేందుకు నరకం కనిపిస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామం నుంచి శ్మశానానికి వెళ్లాలంటే సుమారు కిలోమీటరు వెళ్లాలి.. ఆ కిలోమీటరు మేర ట్రాక్టర్లు తిరగడంతో రోడ్డంతా గోతులు పడి నడిచేందుకు వీలులేకుండా పోయింది. ఈ వర్షాకాలంలో ఎవరు మృతి చెందినా శ్మశానానికి తీసుకెళ్లాలంటే వీరు వణికిపోతున్నారు. సరైన మార్గం లేక మృతదేహాలను తీసుకెళ్లే సమయంలో పడిపోతున్నారని వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ మార్గాన్ని బాగు చేయాలని కోరుతున్నారు.

- పాలకోడేరు



కాళ్ళ మండల పరిషత్ కార్యాలయం వద్ద..

సీసలి రోడ్డు పక్కన స్వాగతం బోర్డు

కాళ్ల రాష్ట్రీయ రహదారి పక్కన

ఇంకా తొలగని బొమ్మలు..రంగులు

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అధికార యంత్రాంగం వైసీపీ పట్ల స్వామి భక్తిని ప్రదర్శిస్తూనే ఉన్నట్లు కనిపిస్తున్నది. కాళ్ళ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన బోర్డులో ఇప్పటికి వైసీపీ అధినేత జగన్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజులతో ఉన్న సుస్వాగతం బోర్డు విమర్శలకు తావిస్తున్నది. సీసలి గ్రామంలో రాష్ట్రీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన సుస్వాగతం బోర్డు, జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరిట బోర్డులు, కాళ్ళ శివారులో వైసీపీ రంగులతో కూడిన స్వాగతం బోర్డులు ఇంకా మార్చకపోవడంపై కూటమి ప్రభుత్వ నాయకులు విమర్శలు చేస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన రంగు కనిపిస్తే చాలు ఆ ఆనవాళ్లే లేకుండా తొలగించారని, ఇప్పుడెందుకు అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. - కాళ్ల

వలలో చిక్కిన కొండ చిలువ



ఉండి మండలం మహదేవపట్నంలో చెరువుకు అడ్డుగా కట్టిన ఒక కొండచిలువ చిక్కుకుంది. దానిని స్థానిక యువకులు పట్టుకుని అటవీ అధికారులకు అప్పగించారు. ఎస్సీ పేటలో వాలీబాల్ ఆడుకునే ప్రాంతంలో వున్న చెరువులోకి బాల్ వెళ్లకుండా వలను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం ఆ. వలలో చిక్కుకుని వున్న 8 అడుగుల కొండ చిలువను యువకులు చూశారు. దానిని గోనె సంచిలోకి పట్టుకుని పంచాయతీకి తీసుకువచ్చారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. భీమవరం నుంచి అటవీ శాఖ సెక్షన్ అధికారి ఎండీ అబ్దుల్ విచ్చేసి దాన్ని కొల్లేరు-ఉప్పుటేరు పరివాహక ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు.

- ఉండి

ఇక్కడే ఉంటే చనిపోతానేమో..

ఇండియా వచ్చేస్తానంటూ కువైట్ నుంచి సెల్ఫీ వీడియో
ఎమ్మెల్యే బాలరాజు దృష్టికి తీసుకువెళ్లిన కుటుంబ సభ్యులు
భారత్‌కు రప్పించేందుకు ఏర్పాట్లు



తాటి సంకురమ్మ

బుట్టాయగూడెం, ఆగస్టు 2 : పొట్టకూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి అష్ట కష్టాలు పడుతున్న బుట్టాయగూడెం మండలం మర్లగూడెంకు చెందిన తాటి సంకురమ్మ సెల్ఫీ వీడియో ద్వారా తన బాధలను వివరించింది. అనారోగ్యంతో బాధపడు తున్నానని కొన్ని రోజులు ఇక్కడే ఉంటే చనిపోతానని తనను ఇంటికి తీసుకువెళ్లిపోవాలని ఆ వీడియోలో వేడుకుంది. వీడియో వైరల్ కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెం ఏజెంట్‌తో మాట్లాడి బాధితురాలిని ఇండియాకు రప్పించే చర్యలు తీసుకోవాలని లేకుంటే మీపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఇండియాకు రప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆదివారం బాధితురాలు ఇండియాకు బయలుదేరనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సంకురమ్మ తాడేపల్లిగూడేనికి చెందిన ఏజెంట్ ద్వారా 11 నెలలు క్రితం కువైట్ వెళ్లింది. మొదట్లో ఆమె పనిచేస్తున్న యజమాని ఇంట్లో అంతా బాగానే ఉన్నా తర్వాత కష్టాలు ప్రారంభమయ్యాయి. పది మంది ఉన్న ఇంట్లో ఇద్దరు ముగ్గురు పనిచేయ వలసిన చోట ఒక్కరే పని చేయవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. పనిభారం పెరగడమే కాకుండా భోజనం కూడా పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఇంటికి వెళ్ళిపోతానంటే కొడుతున్నారని, ఏజెంట్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో ద్వారా రహస్యంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసింది. సంకుమ్మకు 7వ తరగతి చదివే కీర్తి ప్రియ, 4వ తరగతి చదివే క్రాంతికుమార్ ఇద్దరు పిల్లలు.

ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ విదేశాల మోజులోపడి బతుకులు ఛిద్రం చేసుకోవద్దని ఏజెంట్లు మోసాలకు గురికావద్దన్నారు. ఇతర దేశాలకు పనుల కోసం వెళ్ళాలనుకునే వారు ఒకటికి, రెండుసార్లు ఆలోచించుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇంకా ఎవరైనా విదేశాల్లో ఇబ్బందులు పడుతుంటే తన దృష్టికి తీసుకు వస్తే ఇండియాకు రప్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

బోధనా సామర్థ్యాలను పెంచుకోవాలి

చదువులో వెనుకబడిన వారికే చివరి పీరియడ్ వినియోగించాలి : డీఈవో
'పది' సిలబస్ తగ్గింపునకు టీచర్ల అభ్యర్థన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో అబ్రహం

ఏలూరు అర్బన్, ఆగస్టు 2 : కొత్తగా అమల్లోకి వచ్చిన అకడమిక్ కేలండర్ ప్రకారం పాఠశాలల్లో చివరి పీరియడ్‌ను చదువులో వెనుక బడిన విద్యార్థుల(డల్ స్టూడెంట్స్)కు అదనంగా బోధించడం ద్వారా రెమిడియల్ టీచింగ్ కోసం వినియోగించుకోవాలని ఏలూరు జిల్లా డీఈవో అబ్రహం సూచించారు. ఈ ఏడాది నుంచి కొత్త సిలబస్‌తో కూడిన పదో తరగతి పాఠ్య పుస్తకాల్లోని పాఠ్యాంశాలు కఠినంగా వున్న నేపథ్యంలో వాటి బోధనలో మెలకువలను, నమూనా ప్రశ్నాపత్రాలపై అవగాహన నిమిత్తం జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ (డీసీఈబీ) ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో జిల్లాలోని సబ్జెక్టు టీచర్లకు నిర్వహిస్తోన్న పునశ్చరణ తరగతుల రెండోరోజు కార్యక్రమానికి డీఈవో హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గణితం, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో ప్రతీ విద్యార్థి కనీస సామ ర్థ్యాలను సాధించేలా టీచర్లు బోధనా మెలకువలను పెంపొం దించు కోవాలని, టెన్త్ ఉత్తీర్ణత పెంపుకోసమే రాష్టంలోనే తొలిసారిగా సబ్జెక్టు టీచర్లకు జిల్లాలో ఓరియంటేషన్ క్లాసులను నిర్వహిస్తున్నా మన్నారు. ఇప్పటివరకు కనీసం 20 శాతం కూడా హాజరులేని బాల బాలికల ఇళ్ళవద్దకే క్లాసు టీచర్లువెళ్లి తల్లితండ్రులకు కౌన్సెలింగ్ చేసి పిల్లలు రెగ్యులర్‌గా తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసు కోవాలని కోరారు. స్కూలులో ల్యాబ్, లైబ్రరీలను ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా వినియో గించుకోవాల్సిందేనని, ఆటలు కూడా తప్పనిసరిగా ప్రోత్సహించాలన్నారు. ఇకనుంచి తాను పాఠశాలలను నిత్యం సందర్శి స్తానని, ఉపా ధ్యాయులు కష్టపడి పనిచేయాలని సూచించారు. డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఓరియంటేషన్ క్లాసుల్లో సబ్జెక్టు టీచర్ల నుంచి వచ్చిన సూచనలన్నింటినీ క్రోడీకరించి ఎస్‌సీఈఆర్‌టీకి నివేది స్తామన్నారు. పునశ్చరణ తరగతులు శనివారంతో ముగుస్తాయన్నారు. ఆంగ్ల భాష సబ్జెక్టు రిసోర్స్ పర్సన్లుగా శ్రీనివాసరావు, విల్సన్, రమణి, ప్రాన్సీనా వ్యవహరించారు.

సిలబస్‌ను తగ్గించాల్సిందే : టీచర్ల వినతి

భారీ సిలబస్‌తో, సోషల్ స్టడీస్ వంటి కొన్ని సబ్జెక్టులకు వివిధ విభాగాల్లో వేర్వేరుగా పాఠ్య పుస్తకాలు, కఠినత్వంతో కూడిన ప్రశ్నపత్రాలు తదితర అంశాలతో జఠిలంగా వున్న టెన్త్ పాఠ్యపుస్తకాల్లో సిలబస్‌ను తగ్గించాల్సిన ఆవశ్యకత ఉందని ఓరియంటేషన్ క్లాసుల్లో రెండోరోజు కూడా ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా హిందీ, సోషల్, ఆంగ్లం సబ్జెక్టుల్లో సిలబస్‌ను కుదిస్తేనే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఆ మేరకు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో నమూనా ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తే నేరుగా పాఠ్యపుస్తకాల నుంచి కాకుండా అప్లికేటెడ్ ప్రశ్నా విధానాన్ని అనుసరించడం వల్ల ఇవి విద్యార్థులను తికమక పెట్టడం ఖాయమని భావిస్తున్నారు. ఇటువంటివే 60 శాతం ప్రశ్నలు ఉన్నాయని, వీటికి జవాబులను విద్యార్థులు ఆలోచించి రాయాల్సి ఉంటుందే తప్ప పాఠ్యపుస్తకాలను చదివిరాసే పరిస్థితులు లేవని చెబుతున్నారు. ఉపాధ్యాయుల సూచనలను ప్రభుత్వానికి తెలియజేయడానికి జిల్లా విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. అయితే ఓరియంటేషన్ క్లాసుల్లో లేవనెత్తిన అభ్యంతరాలు, టీచర్ల సూచనలను ప్రభుత్వం పరిశీలించి, అమలు చేయాలంటే ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్తే తప్ప ఫలితం ఉండదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఎస్‌ఎంసీ ఏర్పాటైన పాఠశాలలకే గ్రాంట్లు

తాజా మార్గదర్శకాల్లో ప్రభుత్వం స్పష్టీకరణ

ఏలూరు అర్బన్, ఆగస్టు 2 : ప్రైవేటు పాఠశాలలు మినహా మిగతా ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ పాఠశాలలన్నింటికీ ఎస్ఎంసీల ఎన్నికలు నిర్వహించాల్సిందేనని స్పష్టం చేసింది. ఏ కారణం తోనైనా ఎస్ఎంసీ ఏర్పాటు చేయకపోతే సంబంధిత పాఠశాలకు గ్రాంట్లు విడుదల చేయబోమని హెచ్చరించింది. ఈ నెల 8న జరుగనున్న పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు సంబంధించి విద్యాశాఖ శుక్రవారం మరిన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. రెండేళ్ళ కాలపరిమితితో ఏర్పాటయ్యే ఎస్ఎంసీలో కమిటీ సభ్యుని కుమార్తె/ కుమారుడు పాఠశాలను వీడితే ఆ సభ్యుని పదవీకాలం ఆటో మేటిక్‌గా ముగిసినట్టేనని స్పష్టం చేసింది. సభ్యుల ఎన్నికలను స్కూలు హెచ్ఎం నిర్వహించాలని, కనీసం 50 శాతం మంది తల్లితండ్రులు /సంరక్షకులు హాజరుకావాలని సూచించింది. ఒక తరగతిలో ఎన్ని మీడియంలు, సెక్షన్లు వున్నా అన్నింటినీ ఒకే తరగతిగా పరిగ ణించాలని అధికారులు సూచించారు. ఎస్ ఎంసీలో ప్రధాన పాత్రదారులు విద్యార్థుల తల్లితండ్రులేనని స్పష్టం చేశారు. పాఠశాల సక్రమంగా నడిచేలా అజమాయిషీ చేయడం, కావలిసిన సదుపాయాలను కల్పిస్తూ, పాఠశాలను అభివృద్ధి చేయడం ఎస్ఎంసీల ప్రధాన బాధ్యత అని అన్నారు. కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను సభ్యులు ఎన్నుకుంటారని, వీరిలో ఒకరు బలహీన వర్గాలకు చెందినవారై ఉండటంతో పాటు, కనీసం ఒక మహిళ ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 1,810 ఎస్ఎంసీలకు ఎన్నికలు నిర్వహించేందుకు సమగ్రశిక్ష జిల్లా కార్యాలయం ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది.

ఏలూరులో వందేభారత్ హాల్ట్‌కు ఎంపీ వినతి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 2: వందేభారత్ రైలు ఏలూరు స్టేషన్‌లో ఆపే విధంగా చర్యలు తీసుకుంటానని రైల్వే ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవేందర్ కుమార్ తెలిపినట్టు ఏలూరు ఎంపీ మహేష్ యాదవ్ తెలిపారు. ఢిల్లీ రైల్ భవన్‌లో శుక్రవారం దేవేందర్ కుమార్‌ను ఎంపీ కలిశారు. ఈ సందర్భంగా వందేభారత్ రైలును ఏలూరులో నిలుపుదల చేయాలని కోరగా సానుకూలంగా స్పందించిన ఆయన వీలైనంత త్వరలో ఏలూరులో వందేభారత్ రైలును హాల్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

41 మంది సీఐల బదిలీలు

ఏలూరు క్రైం / భీమవరం క్రైం. ఆగస్టు 2 : ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న సీఐలలో 41 మందిని బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏలూరు రేంజ్ పరిధిలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలో పని చేస్తున్న 41 మందికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే వివిధ కారణాల వల్ల ఇద్దరు సీఐల బదిలీలు నిలిపివేసినట్లు సమాచారం. పోలవరం సీఐగా పనిచేస్తున్న మధుబాబు, గన్నవరం ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న పెద్దిరాజుల బదిలీలను నిలిపివేస్తూ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. అలాగే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అతి చేసిన కొందరిని ప్రభుత్వం వీఆర్‌కు పంపింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఆర్.అంకబాబు	వీఆర్ కాకినాడ	సామర్లకోట యూపీఎస్
డి.సురేష్	సామర్లకోట యూపీఎస్	(వీఆర్)ఏలూరు రేంజ్
టి.క్రాంతికుమార్	జీలుగుమిల్లి సర్కిల్	పెద్దాపురం సర్కిల్
వై.రవికుమార్	పెద్దాపురం సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
జి.చెన్నకేశవరావు	వీఆర్ ఏలూరు రేంజ్	తుని రూరల్ సర్కిల్
ఎస్‌వీవీఎస్ మూర్తి	తుని రూరల్ సర్కిల్	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.మోహన్‌కుమార్	వీఆర్ ఏలూరు రేంజ్	ముమ్మడివరం సర్కిల్
ఎన్.కొండయ్య	ముమ్మడివరం సర్కిల్	తణుకు టౌన్ పీఎస్
సీహెచ్ విద్యాసాగర్	ఇనగుదురు(కృష్ణా)	రావులపాలెం సర్కిల్
ఎం.రాంకుమార్	రావులపాలెం సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
పి.విశ్వం	దిశా పోలీస్‌స్టేషన్ ఏలూరు	కొవ్వూరు టౌన్ యూపీఎస్
వి.జగదీశ్వరరావు	కొవ్వూరు టౌన్ యూపీఎస్	ఆకివీడు సర్కిల్
సత్యనారాయణ	ఆకివీడు సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
కె.రజనీకుమార్	సీసీఎస్-2 తూర్పుగోదావరి	పాలకొల్లు టౌన్ యూపీఎస్
కె.మంగాదేవి	పాలకొల్లు టౌన్ యూపీఎస్	అలాట్ టు తూర్పుగోదావరి
జి.శ్రీనివాస్	భీమవరం టుటౌన్ పీఎస్	పాలకొల్లు రూరల్ సర్కిల్
కె.సతీష్	పాలకొల్లు రూరల్ సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
బి.యాదగిరి	వీఆర్ ఏలూరు రేంజ్	నర్సాపురం టౌన్ యూపీఎస్
కె.అప్పలస్వామి	నర్సాపురం టౌన్ యూపీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
జి.కాళిచరణ్	వీఆర్ ఏలూరు రేంజ్	భీమవరం టుటౌన్ పీఎస్
ఎం.నాగరాజు	తణుకు టౌన్ యూపీఎస్	భీమవరం వన్‌టౌన్ పీఎస్
అడబాల శ్రీను	భీమవరం వన్‌టౌన్ పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
పి.కృష్ణ	వీఆర్ ఏలూరు రేంజ్	కైకలూరు టౌన్ పీఎస్
ఎస్.వీ నారాయణ	డీపీటీసీ మచిలీపట్నం	గన్నవరం ట్రాఫిక్ -2 పీఎస్
రవికుమార్	గన్నవరం ట్రాఫిక్-2 పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
బి.ఎస్.చైతన్యకృష్ణ	కాకినాడ ట్రాఫిక్- 2 పీఎస్	కాకినాడ రూరల్ సర్కిల్
ఎ.శ్రీనివాస్	కాకినాడ రూరల్ సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
బొక్కా పెద్దిరాజు	వీఆర్, ఏలూరు రేంజ్	సర్పవరం పీఎస్
వై.ఆర్.కె.శ్రీనివాస్	సర్పవరం పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
జి.మధుబాబు	పోలవరం సర్కిల్	రాజమహేంద్రవరం త్రీటౌన్
వీరయ్యగౌడ్	రాజమహేంద్రవరం త్రీటౌన్	(వీఆర్) ఏలూరు రేంజ్
కె.విజయబాబు	టీసీపీఎస్-1 రాజమహేంద్రవరం	కొవ్వూరు రూరల్ సర్కిల్
పి.శ్రీనివాసరావు	కొవ్వూరు రూరల్ సర్కిల్	(వీఆర్)ఏలూరు రేంజ్
జె.మురళీకృష్ణ	వీఆర్ ఏలూరు రేంజ్	కంకిపాడు సర్కిల్
వి.శ్రీనివాసరావు	కంకిపాడు సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
టీవీవీ రామారావు	పెనమలూరు యూపీఎస్	ఉయ్యూరు టౌన్ యూపీఎస్
ఎండీ హబీబ్‌భాషా	ఉయ్యూరు టౌన్ యూపీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
సోమేశ్వరరావు	టీసీఆర్ మచిలీపట్నం	గుడివాడ రూరల్ సర్కిల్
కె.ఏసుబాబు	గుడివాడ రూరల్ సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
వి.పెద్దిరాజు	గన్నవరం ట్రాఫిక్-1 యూపీఎస్	గుడివాడ టుటౌన్ పీఎస్
ఎం.నాగదుర్గారావు	గుడివాడ టుటౌన్ పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్

క్రైం కార్నర్

వ్యాపారంలో నష్టాలు.. ఆత్మహత్య



ఏలూరు క్రైం, ఆగస్టు 2 : వ్యాపారంలో నష్టాలు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. ఏలూరు ఏకేజీ సెంటర్‌కు చెందిన తలపాకల భాస్కరరావుకు (45) భార్య ఇద్దరు పిల్లలున్నారు. సోఫాల వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు, కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో వంటగదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. సమాచారం అందుకున్న టుటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

చింతలపూడి, ఆగస్టు 2: చింతలపూడి మండలం సీతానగరం గ్రామానికి చెందిన కనుమూరి మల్లాచారి (30)తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. సంఘటనా స్థలాన్ని ఎస్సై కుటుంబరావు పరిశీలించారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, అప్పులు చేసి తీర్చలేక ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి తరలించినట్లు చెప్పారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఒకరి మృతి

భీమడోలు, ఆగస్టు 2 : భీమడోలు మండలం పూళ్ల శివారు వసంత కాలనీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం మునిపల్లి గ్రామానికి చెందిన మిద్దే వెంకటేశ్వరరావు (37) హనుమాన్ జంక్షన్‌లోని ఒక కంపెనీలో ఫిట్టర్‌గా పని చేస్తుంటాడు. గురువారం మునిపల్లికి ద్విచక్రంపై వస్తుండగా పూళ్ల శివారు రోడ్డు పక్కన ఆపి ఉన్న కంటెయినర్ లారీని ఢీకొట్టడంతో మృతిచెందాడు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



పోలవరం, ఆగస్టు 2 : రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలపాలైన సంఘటన పోలవరం మండలంలో శుక్రవారం జరిగింది. పోలవరం పంచాయతీ వడ్డీలపేట ప్రాంతానికి చెందిన ముగ్గురు మత్స్య కారులు పోలవరం నుంచి తహసీల్దారు కార్యాలయానికి తమ బైక్‌పై వెళుతూ స్థానిక కొండ కాలువల ఇరుకు వంతెనపై నుంచి వస్తున్న స్కూలు బస్సుని తప్పించే క్రమంలో బైకుతో సహా కాలువలో పడిపోయారు. దీంతో బైకుపై ఉన్న పంతుల రామకృష్ణ, నగేరు సుబ్రహ్మణ్యం, గోపల రామకృష్ణ లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారికి ప్రథమ చికిత్స అందించారు. తీవ్ర గాయా లపాలై కాళ్ళు విరిగిన సుబ్రహ్మణ్యం, గోపల రామకృష్ణలను రాజమహేంద్ర వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయాలపాలైన డ్రైవర్ సాయి

జీలుగుమిల్లి వద్ద రోడ్డు ప్రమాదం..డ్రైవర్‌కు గాయాలు

జీలుగుమిల్లి, ఆగస్టు 2 : జీలుగుమిల్లి సమీప జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలై ఆస్పత్రి పాలయ్యాడు. దర్భగూడెంకు చెందిన ఒక రైతు వద్ద కుక్కునూరు మండలం దాచారంకు చెందిన సాయి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టరు వెళ తుండగా గ్యాస్ గొడౌన్ సమీపంలో ఆగి ఉన్న లారీని ట్రాక్టరు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సాయి తలకు తీవ్ర గాయమైంది. జీలుగుమిల్లి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బాకీ కట్టమన్నందుకు మహిళతో అసభ్య ప్రవర్తన

ద్వారకాతిరుమల, ఆగస్టు 2: మధ్యవర్తిగా ఉండి డబ్బులు ఇప్పించి నందుకు బాకీ కట్టమని అడిగిందన్న అక్కసుతో ఆమె ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి దుర్భాషలాడటమే కాకుండా అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ద్వారకాతిరుమల పోలీసులు తెలిపారు. మండలంలోని ఐఎస్ రాఘవాపురానికి చెందిన షేక్ అహమ్మద్ ఉన్నీషా అనే మహిళ బుట్టాయిగూడెం మండలం దొరమామిడికి చెందిన షేక్ బారిమామ్‌కు తనకు తెలిసిన వ్యక్తి వద్ద నుంచి రూ.6 లక్షలు అప్పుగా ఇప్పించింది. కొంత కాలం తర్వాత బాకీ అతనికి చెల్లించమని అడిగింది. దీంతో బారిమామ్ ఈనెల 1న ఉదయం 11 గంటలకు ఉన్నీషా ఇంటికి వెళ్లి నన్నే బాకీ కట్టమంటావా చంపుతా అంటూ బెదిరించి బూతులు తిడుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై శుక్రవారం బాధితురాలిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ఉండిలో పేకాట స్థావరంపై దాడి

ఉండి ఆగష్టు 2:ఉండిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఉండి చిక్కాల వీరన్ననగర్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.3430 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

ద్వారకాతిరుమలలో రెండు కాసుల బంగారం అపహరణ

ద్వారకాతిరుమల, ఆగస్టు 2: వైద్యం చేయించుకునేందుకు నెలక్రితం హైదరాబాద్ వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని ద్వారకాతిరుమలకు చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన కొయ్యగూర శ్రీవల్లి గత నెల 2న వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లింది. ఈనెల 2న ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపుల తాళం పగులకొట్టి ఉంది. దీంతో లోపలకు వెళ్లి చూడగా బీరువా తలుపులు పగుల కొట్టి రెండు కాసుల బంగారు వస్తువులు తస్కరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

సిద్దాపురంలో పెద్దింటి అమ్మవారి హుండీ చోరీ

ఆకివీడు రూరల్ ఆగస్టు 2 : ఆకివీడు మండలం సిద్దాపురం కురుపాక వంతెన సమీపంలోని పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద హుండీ చోరీకి గురైంది. సిద్దాపురంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో శుక్రవారం హుండీని గుర్తించిన విద్యార్థులు ఉపాధ్యాయులు, స్థానికులకు తెలియజేశారు. హుండీ పెద్దింటి అమ్మవారి ఆలయానికి చెందినదిగా స్థానికులు గుర్తించారు. సుమారు రూ.10 వేలు నగదు చోరీకి గురై ఉంటుందని స్థానికులు తెలియజేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆకివీడు, చుట్టుపక్కల ప్రాంతాలలో చోరీలు పెరిగిపోయాయని ప్రజలు వాపోతున్నారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం



లింగపాలెం, ఆగస్టు 2 : ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన గోగుంట విజయ్‌కుమార్ కనిపించడం లేదంటూ కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై రాంబాబు తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన గోగుంట విజయ్‌కుమార్ మతిస్థిమితం లేక ఇంటి నుంచి వెళ్ళిపోయినట్లు తెలిపారు. గతంలో విజయ వాడలో మందులు వాడుతు న్నామని, గతనెల 28వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్ళి రాక పోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్ళదగ్గర వెతికినట్లు తెలిపారు. ఎక్కడా కనిపించక పోవడంతో శుక్రవారం కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్త పై కేసు నమోదు

టి.నరసాపురం, ఆగస్టు 2: మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు టి.నరసాపురం ఎస్సై దుర్గామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. టి.నరసాపురం మండలంలోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి పుష్పరాజ్యం, భర్త ప్రసాద్‌కు 25 ఏళ్లక్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన ప్రసాద్ రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యని వేధిస్తూ కొడుతుండేవాడని ఈ క్రమంలో గత జూన్ 5న అతిగా మద్యం సేవించి వచ్చి భార్యను కొట్టి ఇంటినుంచి గెంటేశాడని దీంతో పుష్పరాజ్యం గ్రామ పెద్దలను ఆశ్రయించింది. పెద్దలు హెచ్చరించినా ప్రసాద్ భార్యను ఇంటికి రానివ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించినఎన్ఎస్ఐసీ అధికారులు

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు జాబ్ స్కిల్స్‌పై శిక్షణ

నూజివీడుటౌన్, ఆగస్టు 2:ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశ్రమల్లో ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన నైపుణ్యంపై శిక్షణ ఇస్తామని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ) అధికారులు అన్నారు. ఎన్ఎస్ఐసీ హైదరాబాద్‌కు చెందిన జీఎం సుబ్రమణి, డిప్యూటీ మేనేజర్ టి.ముత్తు కుమారన్, డిప్యూటీ మేనేజర్ అబ్దుల్ ఖాదర్ నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించి క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్‌తో పాటు పలు విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం సహకారంతో సూక్ష్మ పరిశ్రమల స్థాపన ఎలా చేయాలి అనే అంశాలపై చర్చించారు. అకడమిక్ డీన్ రత్నాకర్, అసోసియేట్ డీన్ డాక్టర్ జ్యోతిలాల్ నాయక్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రావణి, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



పోటీల వివరాలతో ఉన్న బ్రోచర్

పోలీసు షార్ట్ ఫిలిం కాంటెస్ట్‌కు ఆహ్వానం

ఏలూరు క్రైం, ఆగస్టు 2 : మహిళలు, బాలబాలికల రక్షణ, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించే విధంగా షార్ట్ ఫిలిం పోటీని నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్ ఫిలిం ఒక నిమిషం నుంచి రెండు నిమిషాల నిడివితో ఉండాలి. దీనిని రూపొందించి ఈ నెల 13వ తేదీలోపు జిల్లా అధికారుల సెల్‌ఫోన్ నెంబరు 99488 90429కు పంపాలని సూచించారు. అధికారులు పరిశీలించి మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు ఆగస్టు 15వ తేదీన అందిస్తారన్నారు. ఉత్సాహవంతులైన విద్యార్థిని విద్యార్థులు, ప్రజలు ఈ కాంటెస్ట్‌లో పాల్గొని తమ ఆలోచనలకు పదునుపెట్టి బహుమతులు పొందాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

వరి నారుకు డిమాండ్

సెంటు నారు రూ.1000 నుంచి రూ. 1500పైనే



ఉండి ప్రాంతానికి వ్యాన్‌లో వరి నారు రవాణా

ముదినేపల్లి, ఆగస్టు 2 : సార్వా వరి నారుకు డిమాండ్ ఏర్పడింది. వర్షాలకు వెదజల్లిన వరి ముంపునకు గురై ముదినేపల్లి మండలంతో పాటు పరిసర మండలాలు, ఇతర జిల్లాల్లో కూడాఆ వందలాది ఎకరాల్లో దెబ్బ తినడంతో తిరిగి నాట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరి సాగు ఎక్కువగా ముదినేపల్లి మండలంలోనే జరుగుతున్నందున నారు కొనుగోలుకు పశ్చిమ గోదావరి జిల్లా ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాల నుంచి కృష్ణా జిల్లా పెడన, బంటుమిల్లి తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, కౌలు రైతులు వరి నారు కోసం వస్తున్నారు. దీంతో ముదినేపల్లి ప్రాంతంలో వరి నారుకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌తో పాటు ధర కూడా పెరిగింది. సెంటు వరి నారు రూ.1000 నుంచి రూ.1500 వరకు ఇతర జిల్లాల రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా ఉండి ప్రాంత రైతులు వర్షాల వల్ల నారుమళ్లు కూడా దెబ్బతినటంతో ఆ ప్రాంతం నుంచే ఎక్కువ మంది రైతులు వరి నారుకు వస్తున్నారు. సెంటు నారు కొనుగోలు, నారు తీత, రవాణా ఖర్చులు కలిపి ఇతర మండలాలకు చేరేటప్పటికీ రూ.2200 అవుతున్నది. వర్షాలకు ముదినేపల్లి ప్రాంతంలో కూడా వెదజల్లిన వరి పైరు దెబ్బ తినటంతో స్థానిక రైతులు కూడా నారు కొనుగోలు చేస్తుండటంతో మరింత డిమాండ్ పెరిగింది.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి


ఎమ్మెల్యే అంజిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న వార్డు సెక్రటరీలు

భీమవరం టౌన్, ఆగస్టు 2 : తమ సమస్యలు పరిష్కారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు వెల్ఫేర్ కార్యదర్శుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ హనీ ప్రవీణ్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)కు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఐదేళ్ల అనుభవాన్ని పరిగణలోకి తీసుకొని సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగులుగా మార్చి మాతృ శాఖ సాంఘిక సంక్షేమ శాఖ మార్పు చేయాలని, తదితర సమస్యలు తీర్చాలని కోరా రు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.బాలాజీ, మద్ద డేవిడ్ రాజు, జి.రామకృష్ణ, పి.రమేష్, పి.ధనకృష్ణ తదితరులు పాల్గొన్నారు

ఏలూరు కెనాల్ లెవెల్ తగ్గించండి


ఎమ్మెల్యేకి సమస్య తెలుపుతున్న రైతులు, నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 2: నవాబు పాలెం, ఆరుగొలను, కొత్తూరు గ్రామాల్లో వరి పొలాలు నేటికీ ముంపులో ఉన్నాయని వెంటనే ఏలూరు కాలువ లెవెల్ తగ్గించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు రైతులు ముంపు సమస్యపై విన్నవించగా శెట్టిపేట ఇరిగేషన్ అధికారులతో, ఎస్ఈతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్‌లు మద్దుకూరి ధనరాజు, బేతపూడి వెంకటేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణించాలి : బొలిశెట్టి

పెంటపాడు, ఆగస్టు 2: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు శుక్రవారం పాఠ్యపుస్తకాలను అందజేశారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, ఎంపీపీ దాసరి హైమవతి, నల్లమిల్లి చినగోపిరెడ్డి, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం పేదల పక్షం : ఆరిమిల్లి


అన్న క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న ఆరిమిల్లి

తణుకు, ఆగస్టు 2: పేదల పక్షాన కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం సొసైటీ రోడ్డులోని అన్న క్యాంటీన్ భవన పనులను ఆయన పరిశీలించారు. గతంలో నిర్మించిన ఈ భవనం వదిలేయడంతో ఇపుడు రూ. 20 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేయాల్సి వచ్చిందన్నారు. ఈ నెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 183 అన్న క్యాంటీన్లు ప్రారంభమవుతాయన్నారు.టీడీపీ పట్టణ అధ్యక్షుడు కేవీ కృష్ణ, డీఈఈ కె.ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యావంతులు, మేధావుల వల్లే దేశాభివృద్ధి

భీమవరం టౌన్, ఆగస్టు 2 : దేశాభివృద్ధి విద్యావం తులు మేధావుల వల్లే జరిగిందని, నేటి విద్యార్థులు విద్య తోపాటు ప్రగతిని సాధించి దేశ భవిష్యత్‌కు కృషి చేయాలని సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి మందిరం అధ్యక్షుడు కంతేటి వెంకట రాజు, లయిన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ అన్నారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు కుమారుడు కొయ్యే చిట్టిరాజు సివిల్స్‌లో 833వ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కి ఎంపికై తొలిసారిగా భీమవరం వచ్చిన సందర్భంగా శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. అలాగు ఎమ్మెల్సీ వంక రవీంద్ర నాథ్ సహచర మండలి సభ్యులు జయమంగళం వెంకట రమణ, కౌలు శ్రీనివాస్ చిట్టిరాజుకు అభినందనలు తెలిపారు. మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, కుమారుడు సుందర్ రాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కారుమూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు సత్కారం



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 2: తాడేపల్లిగూడెం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో అమరావతిలో మంత్రి సత్యకు మార్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. జిల్లా మీడియా కన్వీనర్ నరిసే సోమేష్, మాజీ సైనికోద్యోగ సంఘ నాయకులు టి. భోగేశ్వరరావు ఈ నెల 11న నిర్వహించే కార్గిల్ విజయదివస్‌కు హాజరు కావాలని కోరారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

నరసాపురం టౌన్, ఆగస్టు 2: పట్టణంలోని రుస్తుంబాదాకు చెందిన కేసరి యోక్షిత్‌బాబికి శుక్రవారం రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని కొవ్వలి ట్రస్టు ఉపాధ్యక్షుడు నిమ్మకాయల నీలిమాదేవి చేతుల మీదుగా అందించారు. యోక్షిత్‌బాబి కరోనా సమయంతో తండ్రిని కోల్పోయాడు. తల్లి టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆర్థిక సోమత్త లేకపోవడంతో ట్రస్టు సభ్యుల్ని కలిశారు. దీంతో ట్రస్టు చైర్మన్ కొవ్వలి నాయుడు స్పందించారు. ట్రస్టు రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ మొత్తాన్ని ఆ విద్యార్థికి అందించారు. సంకు భాస్కర్, బాబు, ఆరేటి వేణు, కోటిపల్లి బ్రహ్మానందం, బుజ్జీ, రాంబాబు, మల్లాడి మూర్తి, పద్మారావు, వాసు, లక్ష్మణ్ పాల్గొన్నారు

● తణుకు : పట్టణానికి చెందిన బీటెక్ విద్యార్థిని బొలిశెట్టి కీర్తి చదువు నిమిత్తం మానవత ఆర్థిక సాయం అందించింది. సంస్థ సభ్యుడు కోర్లేపర సత్యనారాయణ అందజేసిన రూ. 10 వేలను రోటరీ క్లబ్‌లో విద్యార్థినికి అందజేశారు. జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, వీవీ రామకృష్ణ, రమణ మూర్తి, శివన్నారాయణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



యలమంచిలి, ఆగస్టు 2: స్థానిక ఉమా నర్సింహ కల్యాణ మండపం నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. నూతన అధ్యక్షునిగా చిలుకూరి రాఘవేంద్రకుమార్, గౌరవాధ్యక్షునిగా తమ్మినీడి నర్సింహ రావు, ఉపాధ్యక్షునిగా తాళ్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా టి.వెంకటేశ్వరరావు, సహాయకార్యదర్శిగా నెక్కంటి కిరణ్, కోశాధికారిగా తమ్మినీడి సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. యలమంచిలి రైతు సంఘం అభివృద్ధికి దాత తమ్మినీడి నర్సింహరావు రూ. రెండు లక్షలు విరాళాన్ని అందజేశారు. టి.సూర్యప్రసాద్, టి.బుజ్జిబాబు, బి.హరికిషోర్ పాల్గొన్నారు.

దొంగరావిపాలెంలో ఫ్రైడే.. డ్రైడే

పెనుగొండ, ఆగస్టు2 : సిద్ధాంతం పీహెచ్‌సీ పరిధిలోని దొంగరావిపాలెంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఏఎస్ భృంగేశ్వరరావుతో కలిసి తణుకు సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు పలు ప్రాంతాలను పరిశీలించారు. హెల్త్ సూపర్‌వైజర్ శామ్యూల్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ ఉదయశ్రీ, గ్రామ ఆరోగ్య కార్యదర్శి రాజ కుమారి పాల్గొన్నారు.

నూకాలమ్మకు వెండి సమర్పణ

భీమవరం టౌన్, ఆగస్టు 2 : పట్టణంలోని 33వ వార్డులోని నూకాలమ్మ వారి వెండి చీరకు అదే వార్డుకు చెందిన గమిడి బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మి సౌజన్య దంపతులు, గమిడి శివ కార్తీక్ మౌనిక దంపతులు, భైరెడ్డి విష్ణువర్ధన్, శ్రీశివ మానస దంపతులు 250 గ్రాముల వెండి సమర్పించారు. కమిటీ సభ్యులు రౌతు అప్పారావు, మెట్టా మురళీకృష్ణ, సిరియాల నాగేశ్వరావు, రౌతు హరిబాబు, తాళ్లపూడి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టాలి


భీమవరంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న చంద్రశేఖర్

కాళ్ల, ఆగస్టు 2 : పుట్టిన బిడ్డకు గంటలోపే మురిపాలు పట్టాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో కాళ్ల సెక్టార్ బొండాడపేటలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ జీవీవీ మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూర్యకుమారి మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలని, ఆ తరువాత తల్లిపాలతో పాటు అదనపు ఆహారం పెట్టాలని తల్లులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి సూజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

● ఆకివీడు : పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం వలన రొమ్ము, అండాశయంలో క్యాన్సర్ ప్రమాదాన్ని నియంత్రించుకోవచ్చునని సీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యురాలు కె.నవీన తెలిపారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో మహిళలకు తల్లిపాలు పై అవగాహన కల్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నజ్రీన్, వైద్యులు లక్ష్మీనారాయణ, ప్రశాంత్‌కుమార్, రాజేష్‌రెడ్డి, చైతన్యవర్మ, అచ్యుత్ గణేష్, సోల్‌మెన్‌రాజు తదితరులు ఉన్నారు.

● భీమవరం క్రైం : శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు సుబ్బలక్ష్మీ జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల్ల చంద్రశేఖర్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కళ్యాణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆకివీడు రూరల్ : పెదకాపవరం పీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఎంపీపీ కఠారిజయలక్ష్మీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీహెచ్‌సీ వైద్యులు రమేష్, కె.ప్రసాద్, సూర్యనారాయణ, మార్తమ్మ, రాజామణి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● పాలకోడేరు : పెన్నాడలో తల్లిపాల వారోత్సవం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లీలాలక్ష్మి, ఆకివీడు సీడీపీఓ వాణీవిజయరత్నం, అంగన్వాడీ సూపర్‌వైజర్ పార్వతి, వైద్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

● ఆచంట : కొడమంచిలి , కోనపోతు గుంటలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. డాక్టర్ పావని, ఐసీడీఎస్ అధికారి కృష్ణకుమారి మాట్లాడుతూ పుట్టిన శిశువుకు మొదటి వ్యాధి నిరోధక టీకాగా తల్లిపాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలాంబ, వైద్య సిబ్బంది డి. పుష్పరాజ్యం , రమణ, వల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● పోడూరు : రేజర్లపేటలోని అంగనవాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమంలో పెనుమదం సర్పంచ్ తానేటి బాబూరావు పాల్గొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంఎన్ పద్మావతి మాట్లాడుతూ వారం రోజులు పాటు ప్రతీ అంగనవాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్, కూటమి నాయకులు కడలి ఆంజనేయులు, దేరవపు దొరబాబు, చోరపల్లి ప్రభాకర్, జక్కంశెట్టి రాంబాబు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగనవాడీలు పాల్గొన్నారు.

● మొగల్తూరు : రామన్నపాలెం సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లో తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లి పాలతో రోగ నిరోధక శక్తి కలుగుతుందని మెరుగైన పోషకాహారం అందుతుందన్నారు. ఏఎన్‌ఎం ఎస్‌జే సత్యవతి, ఆస్పత్రి సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● పాలకొల్లు రూరల్ : తల్లి పాలలో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా లంకలకోడేరు పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిరా ప్రాజెక్టు డైరెక్టర్ సుజాతా రాణి, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, డాక్టర్ ఎం.నవ్యజీవన్, పీహెచ్‌ఎన్ పి.ఎలిజెబెత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవేణి, మల్లేశ్వరి, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

దరఖాస్తులు భారీగా వస్తే క్షేత్రస్థాయిలో పరిశీలన

కలెక్టర్ నాగరాణి


కమిషనర్, హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, ఆగస్టు 2 : ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం కలెక్టర్ పీఎం విశ్వకర్మ పథకంపై సమీక్షించారు. గుంపగుత్తగా దరఖాస్తులు వస్తే క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎంతమంది శిక్షణ పొందారు, ఎంతమందికి బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి తదితర విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మంగపతి రావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి సీహెచ్ అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి విక్టర్, భీమవరం డీఎల్‌డీవో అప్పారావు పాల్గొన్నారు.

యానాది కుటుంబాలకు మెరుగైన జీవనం కల్పించాలి

జిల్లాలోని యానాది కుటుంబాలకు మెరుగైన జీవన విధానం కల్పించే దిశగా చర్యలు చేపట్టాల కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో హౌసింగ్, మునిసిపల్ కమిషనర్, తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యానాదులను గుర్తించి గృహాలు లేని వారి పేర్లు నమోదు చేయాలన్నారు. భీమవరం లెప్రసీ కాలనీలో గురువారం స్వయంగా పర్యటించానన్నారు. వాంబే గృహాలలో నివసిస్తున్న వారి ఇళ్ల మరమ్మతులకు ప్రతిపాదనలను తయారు చేసి అందజేయాలన్నారు. అలాగే ఇంకా ఇల్లు లేని వారిని గుర్తించే నమోదు చేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా టాయిలెట్లు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. యానాది పిల్లలను అంగన్‌వాడీ పాఠశాలలో చేర్పించాలన్నారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, భీమవరం మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం


నరసాపురంలో కేక్‌కట్ చేస్తున్న ఎమార్పీఎస్ నాయకులు

నరసాపురం టౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ శుక్రవారం ఎమార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. థామస్‌వంతెన నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సీర్రా వెంకటరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను నాయకులు కట్ చేసి పంచారు. జీవరత్నం, యేషయ్య, సూరిబాబు, సోమరాజు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్ : పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్‌లో ఎమార్పీఎస్ నాయకులు రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చినబాబు ఆధ్వర్యంలో బాణా సంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గ ఎమార్పీఎస్ అధ్యక్షుడు పాటూరి సువర్ణరాజు, పట్టణ అధ్యక్షుడు పసల బోసు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సీనియర్ నేత సనమండ ఎబినైజర్, మంద కృష్ణ మాదిగ, సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటాలకు పాలాభిషేకా లు చేశారు. యార్లగడ్డ రత్నరాజు. పసుపులేటి రాజేష్ ఖన్న, ఎల్ వ్యామ్‌బాబు,కొండేటి వరదరాజు, సిద్దుల గాంధీ, ఉల్లంపర్తి ప్రభాకర్, పి.నందబాబు పాల్గొన్నారు.

సరైన నిర్ణయం



ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి, అంబేడ్కర్ ఆశయాలకు, లక్ష్యాలకు సరైందని రాష్ట్ర తెలుగు దేశం పార్టీ లీగ్ సెల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు బొంతు వెంకట తిరుమలరావు (మాల) అన్నారు. దశాబ్దాలుగా రాజకీయ ఒత్తిళ్లను తట్టుకుని ఎస్సీ వర్గీకరణ సాధించిన వ్యక్తిగా మంద కృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తి శ్లాఘనీయమన్నారు. సీఎం చంద్రబాబు గతంలోనే ఎస్సీ వర్గీకరణ సమర్థిస్తూ తీసుకున్న నిర్ణయంపై ఆనాడే తాను లేఖ రాసారన్నారు. సుప్రీం కోర్టులో ఏడుగురు జడ్జీలలో ఆరుగురు వర్గీకరణను సమర్థించారన్నారు.

- బొంతు వెంకట తిరుమలరావు,
టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, పాలకొల్లు

ఎస్సీ,ఎస్టీల రిజర్వేషన్లకు భంగం


భీమవరంలో మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

భీమవరం అర్బన్ : సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఎస్సీఎస్టీల రిజర్వేషన్లకు భంగం కలిగించేలా ఆర్టికల్ 341కి విరుద్ధంగా రాజకీయ ప్రమేయం ఉండేలా ఉందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ అన్నారు. భీమవరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. న్యాయనిపుణులతో చర్చించి అనంతరం జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య ఆధ్వర్యంలో సర్వోన్నత న్యాయస్థానానికి ఆశ్రయి ంచనున్నట్లు తెలిపారు. సామాజిక వివక్ష కారణంగా ఏర్పరిచిన రిజర్వేషన్లను ఆర్థిక ప్రాతిపదికన ఎలా విడగొడతారని ప్రశ్నించారు. ఈ నెల 8, 9, 10 తేదీలలో ఢిల్లీలో నిరసన చేపడతున్నామన్నారు. మాల మహానాడు నాయకులు చిగురుపాటి రాజేష్, రాజ్ కుమార్, పిట్లా వినోద్ కుమార్ పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ఇది కేవలం ఎస్సీలను విడదీసే కుట్రలో భాగమేనని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందరకుమార్ ఆరోపించారు. 21వ వార్డులో మాల సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. అమలు చేస్తున్న రిజర్వేషన్లలో రాజకీయ ప్రమేయన్ని జోడించే విధంగా తీర్పు ఉందన్నారు. గతంలో సుప్రీంకోర్టు వర్గీకరణ చెల్లదని తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. దోడ్డిగర్ల గంగాధరరావు, మరపట్ల ప్రసాద్, పాలపర్తి జోనా, ఉండ్రు విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

99.13 శాతం పింఛన్ల పంపిణీ

ఆచంట, ఆగస్టు 2 : మండలంలోని 8,182 మందికిగాను శుక్రవారానికి 8,111 మందికి పింఛన్లు పంపిణీ (99.13 శాతం)పూర్తి చేశామని ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. లబ్ధిదారులు అనా రోగ్య రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉన్న వారికి సైతం అక్కడకు వెళ్ళి పింఛన్లు అందజేశారు. ఆచంటకు చెందిన సిర్రా సరూన్ తలసేమియా వ్యాధితో హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వై. ప్రశాంతి అక్కడకు వెళ్ళి లబ్ధిదారుకి రూ. 10 వేల పింఛన్ అందజేశారు.

సొంత నగదు పింఛనుగా అందజేత

పాలకొల్లు రూరల్, ఆగస్టు 2 : కాపవరంకి చెందిన వెంకాయమ్మ అనే వృద్ధురాలికి గత వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్ మంజూరు చేయిస్తానని ఉప సర్పంచ్ అంగర వీరభద్ర కుమార్ (చిన్న) హామీ ఇచ్చారు. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఇంకా వెంకాయమ్మకు పింఛన్ మంజూరు కాకపోవడంతో ఇచ్చిన మాట ప్రకారం తన సొంత సొమ్మును పింఛన్‌గా అందజేశారు. అంగర వీరభద్రకుమార్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆచార్య ప్రఫుల్ల చంద్రరే జయంతి

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 2 : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (అటానమస్) శుక్రవారం ఆచార్య ప్రపుల్ల చంద్రరే జయంతి సందర్భంగా రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, రసాయన శాస్త్ర విభాగం అధిపతి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

లంక భూముల్లో పశు వైద్య శిబిరం

పెనుగొండ, ఆగస్టు 2 : సిద్ధాంతం లంక గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యా ధుల చికిత్స శిబిరం నిర్వహించారు. పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ జేసు రత్నం, సర్పంచ్ చింతపల్లి గణిరాజు, లంక సొసైటీ ప్రెసిడెంట్ జేమ్స్, ఏడీ డాక్టర్ ప్రమీలరాణి, మండల పశువైద్యాధికారి మాధురి పాల్గొన్నారు.

మైక్ సెట్టు బహూకరణ

భీమవరం రూరల్, ఆగస్టు 2 : పీఎస్ఎం బాలిక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని జె.సునీత తల్లిదండ్రులపేరిట రూ.25 వేల విలువ గల మైక్‌సెట్టును బహూకరించారు. ఆమెను హెచ్‌ఎం వీఎం రాధకృష్ణ, సహచరులు అభినందించారు.

వాసవి కళాశాలలో నిహారిక సందడి


మాట్లాడుతున్న నిహారిక

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 2: మెగా డాటర్ కొణిదల నిహారిక తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో సందడి చేశారు. తన నిర్మాణ సారథ్యంలో నిర్మించిన చిత్ర ప్రమోషన్ నిమిత్తం శుక్రవారం ఆమె ఎమ్మెల్యే బొలిశెట్టితో కలిసి హాజరయ్యారు. తాడేపల్లిగూడెం సవిత్రుపేటకు చెందిన ఈదు వంశీ దర్శకత్వంలో నిర్మించిన చిత్ర విశేషాలు ఆమె విద్యార్థులతో పంచుకున్నారు. ఇంజనీరింగ్ కళాశాలలోని కొందరు యువత ఈ సినిమాలో నటించారని వెల్లడించారు. ఈ చిత్రం సందేశాత్మకంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ నిహారిక నిర్మాణంలో తీసిన సినిమాలో తాడేపల్లిగూడెం యువతకు ప్రాధాన్య మివ్వడం అందులోనూ తాడేపల్లిగూడెంకు చెందిన యువ దర్శకుడు వంశీకి అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. వాసవి ఇంజనీరింగ్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో మౌలిక వసతుల కల్పన

కాళ్ల ఆగస్టు 2 : ప్రభుత్వాస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారం అభినందనీయమని కాళ్ల పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.సునీల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనంలోనే విధులు నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతో ఆస్పత్రిలో బెడ్లు, వాటర్ ఫిల్టర్, ఫ్యాన్లతో పాటు బెంచీలు ఏర్పాటు చేశారన్నార. పెదఅమిరం గ్రామానికి చెందిన సరాబు ముఖేష్, తన తండ్రి చిరంజీవి పేరిట, కాళ్ళకూరు గ్రామానికి చెందిన వీరమల్లు సురేష్ తన తల్లిదండ్రుల పేరిట, వనపర్తి మణికుమార్ తన తండ్రి పేరిట, దొడ్డనపూడి గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మణస్వామి తన తండ్రి పేరు మీద వీటిని ఏర్పాటు చేశారన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పశు పోషణలో రైతులకు చేయూత

పోడూరు, ఆగష్టు, 2 :పశు పోషణలో రైతులకు ప్రభుత్వం చేయూత నందిస్తుందని సర్పంచ్ వడ్ల పాటి రాజేంద్రప్రసాదు, మం డల టీడీపీ అధ్యక్షు డు గొట్టుముక్కల సూర్య నారాయణరాజు అన్నారు. ముంపు గ్రామమైన వద్దిపర్రులో 10 టన్నులు పశు పోషణ దాణాను రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ విప్పర్తి శారద, జడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్కా నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు శీలం శ్రీనివాసరావు, ఏడీఏ ఎస్.మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● యలమంచిలి : వరద ముంపు బారినపడ్డ బాడవలోని పాడి రైతులకు ఆరు టన్నులు పశువుల దాణాను కూటమి నాయకులు అందజేశారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనం నాని పశుసంవర్ధక శాఖ ఏడీ మల్లేశ్వరరావు, మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి, ఎన్డీఏ నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బొప్పన హరికిషోర్, కడలి గోపి, రాయి సత్యనారాయణ, రాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు, ఆగస్టు 2 : పట్టణ పరిధిలో విద్యుత్ పనులతో పాటు 11కేవీ లైన్ల దారిలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగింపు పనుల నిమిత్తం శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆకివీడు టౌన్, సమతానగర్‌తో పాటు దుంపగడపలోని పరిశ్రమల ఫీడర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ అహ్మద్‌ఖాన్ శుక్రవారం తెలిపారు.

రెండు వేల ఎకరాల్లో పంట నష్టం


కుళ్ళిన నారును పరిశీలిస్తున్న నాయకులు

పెనుమంట్ర, ఆగస్టు 2 :పెనుమంట్ర, మాముడూరు, పొలమూరు, సోమ రాజు ఇంద్రపర్రు తదితర గ్రామాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం కలిగినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. కౌలు రైతులతో కలిసి ముంపునకు గురైన గ్రామాలలో శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట నష్ట పోయిన రైతులకు అవసరమైన వరి నారు ఇతర ప్రాంతాల నుంచి సరఫరా చేసే ఏర్పాటు చేసి, ఎరువులు ఉచితంగా అందజేయా లని డిమాండ్ చేశారు. రైతులకు దమ్ము, ఊడ్పు, విత్తనాల ఖర్చు తక్షణ సాయంగా రూ.ఏడు వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం తక్షణం లెక్కించాలి : ఆర్డీవో

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 2: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఎర్రకాలువ వరదలకు, వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని త్వరితగతిన నిష్పాక్షికంగా లెక్కించాలని తాడేపల్లిగూడెం ఆర్డీవో బీఎస్ రెడ్డి సూచించారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో పంట నష్టంపై సమీక్షించారు. ఏడీ పి.మురళీకృష్ణ, ఏవో ప్రసాద్, వీఆ ర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ మొగల్తూరు అధ్యక్షుడు బస్వాని సస్పెన్షన్

మొగల్తూరు, ఆగస్టు 2 : పట్టణ టీడీపీ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలును తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా టీడీపీ అధ్యక్షుడు మంతెన రామరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు స్థానిక విలేకరులకు ఈ సమాచార పత్రాన్ని అందించారు. బస్వాని ఏడుకొండలు గతంలోనూ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రామరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనలో మార్పు రాకపోక మరలా రెండో సారి కూడా బలహీనపడేలా మాట్లాడడంతో పార్టీ క్లస్టర్లు, నియోజకవర్గ, మండల నాయకులు, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుకొండలును టీడీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు


వద్దిపర్రులో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ధనలక్ష్మి

పోడూరు/ఆచంట, ఆగష్టు, 2 : ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య సేవలు అందజేస్తున్నామని జిల్లా మెడికల్ క్యాంపుల నిఘా అధికారిణి, కార్యక్రమాల పర్యవేక్షణాధికారిణి డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి తెలిపారు. ఆమె వద్దిపర్రులోని ముంపు ప్రాంతాలను శుక్రవారం పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలతో ఆమె మమేకమై వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వేణుబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి జనసేన చేయూత



తణుకు, ఆగస్టు 2: మున్సిపల్ పారిశుద్య కార్మికుడు శ్రీను విద్యుదాఘాతంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి పైడిపర్రు జనసైనికులు అండగా నిలిచారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి చేతులు మీదుగా రూ. 25 వేలు మృతుడి కుటుంబానికి అందజేశారు. పైడిపర్రు జనసైనికులు పి.నాని, బి.సుధీంద్ర, ఎన్.సత్తిబాబు, బి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తైలాభిషేకం వేడుకల్లో ఎమ్మెల్యే పత్సమట్ల



గణపవరం, ఆగస్టు 2: కరుణా మయుని కృప అందరిపై ఉండాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం గణపవరంలోని చర్చిలో జరిగిన తైలాభిషేక రాకడ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జీసస్ పుట్టుకే లోకానికి ఒక వెలుగని ఆయన కరుణ, దయ ప్రతీ ఒక్కరిపై ప్రసరించాలని కోరారు.

రేపు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల సమావేశం

ఆచంట,ఆగస్టు2 : తాడేపల్లిగూడెంలో ఉమ్మడి జిల్లాల ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ అను బంధ సంఘాల జిల్లా సమావేశం ఆదివారం జరుగుతుందని ఎమ్మెస్పీ జిల్లా గౌరవాధ్యక్షుడు కనపాల పెద్దిరాజు మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె

భీమవరం టౌన్/తాడేపల్లిగూడెం అర్బన్/ఆకివీడు/ఆకివీడురూరల్/ పెంటపాడు/ తణుకు/ఆగస్టు 2 : భీమవరం పట్టణంలోని 36వ వార్డు రామరాజు తోటలో వేంచేసి ఉన్న మావుళ్ళమ్మకు, ఆకివీడు శ్రీరామపురంలోని పెద్దింట్లమ్మకు, తాడేపల్లిగూడెం పట్టణంలోని గణేష్‌నగర్‌లో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారికి, పెదకాపవరం గ్రామదేవత శ్రీపల్లాలమ్మకు, పెంటపాడు కాశీ అన్నపూర్ణేశ్వరి అమ్మకు భక్తులు శుక్రవారం ఆషాఢం సారె సమర్పించారు. వేల్పూరులోని రుద్రేశ్వర వీరభద్ర, మహాలక్ష్మి అమ్మవార్లను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దంపతులు దర్శించుకున్నారు.

అటానమస్ హోదా అభినందనీయం

భీమవరం టౌన్, ఆగస్టు 2 : డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలకు స్వతంత్ర ప్రతిపత్తి కళాశాలగా అటానమస్ హోదాకు ఆమోదం లభించడం అభినందనీయమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలో కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, బోసురాజు,సహాయ కార్యదర్శి రామకృష్ణం రాజు, ప్రిన్సిపాల్ అంజన్ కుమార్‌ను మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు.

వైఎస్‌పాలెంలో ఆక్రమణల తొలగింపు

నరసాపురం రూరల్, ఆగస్టు 2: వైఎస్‌పాలెంలో పంచాయతీ రహదారి నుంచి 217 జాతీయ రహదారి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఆక్రమాణలను జేసీబీ సాయంతో శుక్రవారం తొలగించారు. మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు వైఎస్ బాబులు, సర్పంచ్ బందెల భారతి పర్యవేక్షించారు.

ఆహార నియమాలు పాటించాలి

ఆకివీడు, ఆగస్టు 2 : బీపీ, షుగర్ వచ్చాయంటే జీవిత కాలం ఆహార నియమాలతో పాటు మందులు వాడాల్సిందేనని యూపీహెచ్‌సీ సూపరింటెండెంట్, వైద్యుడు వెంకటపతిరాజు అన్నారు. టీడీపీ, జనసేన ఇన్‌చార్జిలు గోపి, సుమంత్ నేతృత్వంలో స్థానిక సమతానగర్‌లో శుక్రవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, మరియమ్మ తదితరులు ఉన్నారు.

8న విద్యా కమిటీ ఎన్నికలు

తణుకు, ఆగస్టు 2: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 8న ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ్యుల నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరుగుతుంది.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కాళ్ళ ఆగస్టు 2 : మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ పనిచేస్తున్న శివారెడ్డి కుమారుడు బండి సూర్యప్రకాష్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం బొండాడ గూడెం మండలం పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు భోజన ప్లేట్లు, పండ్లు పంపిణీ చేశారు.

● ఉండి : పాందువ్వలోని ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థులకు తన తండ్రి మాదాసి వెంకటేశ్వరరావు 11వ వర్ధంతిని పురష్కరించుకుని విద్యా సామగ్రిని అందించినట్లు కేవీపీఎస్ మండల కార్యదర్శి మాదాసు గోపి తెలిపారు.